ప్రజాశక్తి
సోమవారం 4 నవంబర్ 2024
5
అనంతపురం

రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న సినీ నటుడు శ్రీకాంత్

'అనంత'లో సినీహీరో శ్రీకాంత్ సందడి

"టేస్ట్ ఆఫ్ పులావ్ స్' రెస్టారెంట్‌ను ప్రారంభించిన నటుడు

ప్రజాశక్తి - అనంతపురం

ప్రముఖ సినీ నటులు శ్రీకాంత్ ఆదివారం అనంతపురంలో సందడి చేశాడు. 'టేస్ట్ ఆఫ్ పులావ్ స్' రెస్టారెంట్‌ను ప్రారంభించారు. సినీ హీరో శ్రీకాంత్ ను చూడడానికి అభిమానులు పెద్ద ఎత్తున గుమికూడారు. ఈసందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ అనంతపురంతో తనకు మంచి అనుబంధం ఉందని అన్నారు. తనపై ఇంతటి అభిమానం చూపిస్తున్న అభిమానులకు రుణపడి ఉంటానని అన్నారు. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో ఇటీవల ఏర్పాటైన శ్రేయాస్ గ్రాండ్ హోటల్ లో 'టేస్ట్ ఆఫ్ పులావ్ స్' వెజ్ అండ్ నాన్ వెజ్ రెస్టారెంట్‌ను ప్రారంభించడం సంతోషకరంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రేయాస్ గ్రాండ్ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీకాంత రెడ్డి, నగర ప్రముఖులు, అధికారులు వ్యాపారవేత్తలు, హోటల్ సిబ్బంది పాల్గొన్నారు.

'స్మార్ట్' దగా

స్మార్ట్ మీటర్ల రాకతో మీటర్ రీడర్ల బతుకు ప్రశ్నార్థకంగా మారింది. ఉద్యోగం ఎప్పుడు ఉంటుందో... ఎప్పుడు ఊడుతుందోనని ఆందోళన చెందుతున్నారు. కొన్నేళ్లుగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా చాలీచాలని వేతనాలతో కొనసాగుతున్నారు. రెండు దశాబ్దాలుగా విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న వారు, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని నాటి నుంచి డిమాండ్ చేస్తున్నారు. మరో పక్క కేంద్ర ప్రభుత్వ సూచనలతో రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ స్మార్టు మీటర్లు తీసుకొస్తున్న సందర్భంలో తాము ఉపాధి కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని రీడర్లు ఆందోళన చెందుతున్నారు. కొత్తగా ఏర్పడే సర్కిల్ రీడర్లకు అర్హతలను బట్టి షిఫ్ట్ ఆపరేటర్లు, అటెండర్లు, వాచ్‌మెన్లు, డ్రైవర్లు, గ్యాంగ్‌మెన్లుగా ఉపాధి కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు. ఈ మేరకు ఏపీ మీటర్ రీడింగ్ యూనియన్ ఆధ్వర్యంలో ఇటీవల ఎస్ఈ కి వినతిపత్రం అందజేశారు.

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 6 డివిజన్లు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 350 మంది వరకు మీటర్ రీడర్లు విధులు నిర్వహిస్తున్నారు. శ్రీ సత్య సాయి జిల్లాలోని హిందూపురం డివిజన్ పరిధిలో 68 మంది, కదిరి డివిజన్ పరిధిలో 50 మంది వరకు మీటర్ల రీడర్లు పనిచేస్తున్నారు. వీరు ప్రతి నెలా 1 నుంచి 10వ తేదీ వరకు విద్యుత మీటర్ రీడింగ్ తీస్తుంటారు. ఒక మీటర్ రీడింగ్ తీసినందుకు విద్యుత్ శాఖ సంబంధిత కాంట్రాక్టర్‌కు రూ.6 నుంచి రూ.7 చెల్లిస్తుంది. మిషన్ ఛార్జీలు, ఫోన్ రీచార్జి, రోల్స్, మరమ్మతులు ఈఎస్ఐ, ఈపీఎఫ్ కటింగ్‌లు పోను

రీడర్ చేతికి వచ్చేది కేవలం మీటరుకు రూ.3.50 మాత్రమే. సగటున ఒక్కొక్క మీటర్ రీడర్ మూడు వేల నుంచి 3,500 మీటర్లకు రీడింగ్ తీసే అవకాశముంది. దీంతో వీరికి నెలకు రూ.10 వేల వరకు ఆదాయం సమకూరుతుంది. గత రెండు దశబ్దాలుగా దీనినే నమ్ముకుని పని చేస్తున్న వందలాది మందికి స్మార్టు మీటర్లు రావడంతో ఉపాధి కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. ప్రభుత్వం మాత్రం స్మార్టు మీటర్లు తొలు ప్రభుత్వ కార్యాలయాలకు మాత్రమే బిగిస్తామని చెప్పుకొచ్చారు. అయితే క్షేత్ర స్థాయిలో చూస్తే విద్యుత్ శాఖ స్మార్టు మీటర్లు బిగించడంలో నాలుగు విధానాలను పాటిస్తోంది. ఇందులో క్యాటగిరి వారిగా తొలుత ప్రభుత్వ కార్యాలయాలకు బిగించింది. వెంటనే క్యాటగిరి-2 కింద ఉన్న దుకాణాలు, షాపులకు బిగిస్తోంది. ఈ మీటర్లు బిగిస్తే ఇంటికి వెళ్లి రీడింగ్ తీయాల్సిన అవసరం ఉండదు. కార్యాలయంలో ఉండి ఎవరు ఎంత విద్యుత్‌ను వాడారో చూసి రీడింగ్ తీసే అవకాశం ఉంది. ఇలా తీసిన బిల్లులను సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎనర్జీ సెక్రెటరీల ద్వారా ప్రతి ఇంటికి బిల్లులను అందించే విధంగా విద్యుత్ శాఖ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది.

విద్యుత్ మీటర్ రీడర్ల ఉపాధికి గండం

స్మార్ట్ మీటర్ల రాకతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల్లో టెన్షన్

పట్టణంలో స్మార్ట్ మీటర్‌ను బిగిస్తున్న దృశ్యం

ఉద్యోగాలు కల్పించి ఆదుకోవాలి

విద్యుత్ శాఖలో రెండు దశాబ్దాలుగా మీటర్ రీడర్లుగా విధులు నిర్వహిస్తున్న వారందరికి విద్యుత్ శాఖలో వారి అర్హతలను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించి వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉంది. మీటర్ రీడర్లలో చాలామంది ఐటిఐ, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసుకున్న వారు ఉన్నారు. చాలీ చాలని వేతనాలను తీసుకుంటూ ఎన్నో సంవత్సరాలుగా వారు పని చేస్తున్నారు. ఉద్యోగ భద్రత కల్పిస్తారు అనుకునే సమయంలో స్మార్టుగా ఉద్యోగాలు పోతున్నాయనితెలిసి వారందరు ఆవేదన చెందుతున్నారు. ఉపాధి కోల్పోతున్న వారందరికి వారి విద్యార్హతను బట్టి విద్యుత్ శాఖలో ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. లేని పక్షంలో అందరు ఉద్యోగాలు కోల్పోయి వారి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉంది.ప్రభుత్వం వీరి పట్ల సానూకూల నిర్ణయం తీసుకుని ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి. రెండు దశాబ్దాలకుపైగా పనిచేస్తున్నవారు చాలా మంది ఉన్నారు. వీరంతా మీటర్‌కు కొంత రేటు చొప్పున వేతనం పొందుతున్నారు. ఇంత కాలంగా పనిచేస్తున్నా నేటికీ అవుట్‌సోర్సింగ్ సిబ్బందిగానే పనిచేస్తున్నారు. సీనియార్టీ, అర్హతలను బట్టి విద్యుత్ శాఖలో వీరికి ప్రభుత్వ ఉద్యోగులుగా అవకాశం ఇవ్వాలి. చిరుద్యోగులపట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి.

ఇఎస్ వెంకటేష్,
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

రాష్ట్ర సదస్సుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేస్తున్న రెప్రజెంటేటీవ్‌ల యూనియన్ నాయకులు

కనీస వేతనం అమలు చేయాలి

10న రాష్ట్ర సదస్సు

యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అమర్, మంజునాథ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మెడికల్ సేల్స్ రెప్రజెంటెటీవ్‌లకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని మెడికల్ సేల్స్ రెప్రజెంటేటీవ్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అమర్, మంజునాథ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఎంఎస్ఆర్‌యు భవన్‌లో మెడికల్ రెప్రజెంటేటీవ్‌లు, అదర్ ఇండస్ట్రియల్ సేల్స్ రెప్రజెంటేటీవ్‌లతో సమావేశం నిర్వహించారు. ముందుగా ఈనెల 10వతేదీన నిర్వహించనున్న పరిశ్రమ సేల్స్ రెప్రజెంటీవ్‌లతో రాష్ట్ర సదస్సుకు సంబంధించిన గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెడికల్ సేల్స్ రెప్రజెంటెటీవ్‌లు, ఇతర పరిశ్రమల రెప్రజెంటెటీవ్‌ల సమస్యల పరిష్కారం కోసం సదస్సులో చర్చించనున్నట్లు తెలిపారు. కనీస వేతనంతోపాటు సేల్స్ పేరుతో విపరీతమైన మానసిక ఒత్తిళ్లు తగ్గించాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. వేజ్ బోర్డును నియమించి పెరిగే ధరలకు అనుగుణంగా జీత భత్యాలను ఇవ్వాలన్నారు. కార్మిక చట్టాల స్థానంలో తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. ఈ అంశాలపై చర్చించి పోరాట కార్యాచరణ ప్రకటించనున్నట్లు తెలిపారు. కాగా 10న నిర్వహించే రాష్ట్ర సదస్సుకు మెడికల్ సేల్స్ రెప్రజెంటేటీవ్‌లతో పాటు, ఇతర పరిశ్రమల సేల్స్ రెప్రజెంటటీవ్‌లు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సేల్స్ రెప్రజెంటెటీవ్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు నరేంద్ర, అదర్ ఇండస్ట్రీస్ సేల్స్ రెప్రజెంటెటీవ్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీరాం, సభ్యులు కిరణ్, సురేంద్ర గుప్తా తదితరులు పాల్గొన్నారు.

నార్పల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ముళ్లపొదలు

భయాందోళనలో సిబ్బంది, ప్రజలు

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ కంపచెట్లు, పిచ్చిమొక్కలతో నిండిపోయింది. దీంతో సబ్‌స్టేషన్ చుట్టూ నివాసం ఉండే ప్రజలతోపాటు ఆఫీసులో పని చేసే సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. పిచ్చి మొక్కలు, కంపచెట్లు ఏపుగా పెరగడం వల్ల చుట్టుపక్కల ఉంటే నివాస గృహాల్లోకి పాములు, విష కీటకాలు వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇటీవల కాలంలో మండల కేంద్రంలో పాముకాట్లు ఎక్కువైన విషయం తెలిసిందే. దీనికితోడు వర్షాకాలం కావడంలో ఏమాత్రం కొద్దిగా వర్షం పడినా సబ్‌స్టేషన్ ఆవరణలో పెరిగిన కంపచెట్లు విద్యుత్ తీగలకు తగిలి నిప్పులు వస్తున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని అర్థం కావడం లేదని సబ్‌స్టేషన్ వెనుక నివాసం ఉండే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సబ్‌స్టేషన్‌లో పెరిగిన పిచ్చి మొక్కలు, కంపచెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

కంపచెట్లతో నిండిన నార్పల విద్యుత్ సబ్‌స్టేషన్

కల్లుదేవనహళ్లి వద్ద వంతెన నిర్మించాలి

వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం నియోజకవర్గంలోని బొమ్మనహాళ్ మండలంలోని కళ్లుదేవనహళ్లి వద్ద హగిరిపై వంతెన నిర్మించాలని వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం కందేపల్లి వంతెనను వైసిపి నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ కళ్లుదేవనహళ్లి వంతెన లేకపోవడం వల్ల రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండల కేంద్రానికి వెళ్లాలంటే కర్ణాటక రాష్ట్రంలోని రూపనగుడి కమ్మరచేడు నుంచి వెళ్లాల్సి వస్తోందన్నారు. తద్వారత 60 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి ఉంటుందన్నారు. కావున కల్లుదేవనహళ్లి బ్రిడ్జిని ప్రభుత్వం వెంటనే నిర్మించాలని కోరారు. మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ ఈ బ్రిడ్జి కూలిపోవడం వల్ల రైతులు కూలీలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రోడ్డు వేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఉపేందర్‌రెడ్డి, కణేకల్ మాజీ ఎంపిపి ఆలేరు రాజగోపాల్‌రెడ్డి, జడ్పిటిసి లోకేష్, కాంతారెడ్డి, మండల కన్వీనర్ రామాంజనేయులు, వైస్ఎంపిపి రమేష్ రాజకుమార్, సర్పంచులు పరమేష్, వన్నూరుస్వామి, కోటేశ్వర్‌రెడ్డి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కూలిన కళ్లుదేవనహళ్లి వంతెనను పరిశీలిస్తున్న వైసిపి నాయకులు

ఉచిత గ్యాస్ సిలిండర్‌కు ఆధార్, రేషన్‌కార్డు తప్పనిసరి

బ్రహ్మసముద్రం : ఉచిత సిలిండర్ పథకానికి ఆధార్‌తోపాటు రేషన్‌కార్డు తప్పనిసరి అని తహశీల్దార్ సుమతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్యాస్ వినియోగదారులు ఉచిత సిలిండర్ పొందాలంటే ఆధార్, రేషన్ కార్డులతోపాటు ఇకెవైసి చేయించుకోవాలన్నారు. గ్యాస్ బుకింగ్‌ను ఆన్‌లైన్‌లోగానీ, డీలర్ వద్దనే బుక్ చేసుకోవచ్చన్నారు. సిలిండర్ ఉచిత సిలిండర్ అందిన తర్వాత లబ్ధిదారులకు 48 గంటల వ్యవధిలోనే రాయితీ సొమ్మును వ్యక్తిగత ఖాతాకు జమ చేయనున్నట్లు తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే 1967 టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. అలాగే సందేహాలు ఉంటే గ్రామ సచివాలయాల్లోగానీ,తహశీల్దార్ కేంద్రంలోగానీ సంప్రదించి నివృత్తి చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ భూమి కబ్జా కేసులో వ్యక్తి అరెస్టు

నిందితుడి నుంచి 469 నకిలీ పట్టాదారు పాసుపుస్తకాలు స్వాధీనం

ప్రజాశక్తి - కదిరి టౌన్

నకిలీ పత్రాలతో ప్రభుత్వ భూమిని కబ్జా చేయాలని చూసిన కదిరి పట్టణం నిజాంవలి కాలనీకి చెందిన షేక్ షామీర్ బాషా అరెస్ట్ చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు.కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. కదిరి పట్టణం కొత్త బైపాస్ రోడ్డులో కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమి సర్వే నెంబర్1777 -2లో ఈ నెల 13న నిజాంవలి కాలనీ కి చెందిన షేక్ షామీర్ బాషా జేసీబీ సాయంతో చదును చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు భూ ఆక్రమణ చట్టం కింద కదిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అయితే కేసు నమోదు అయినప్పటి నుండి పరారీలో ఉన్న షేక్ షామీర్ బాషాను ఆదివారం అరెస్టు చేసి అతని వద్ద నుండి సుమారు 301 దొంగ పట్టాలు, 168 జిరాక్స్ నకిలీ పట్టాలు స్వాధీనం చేసుకున్నామని సిఐ చెప్పారు. అంతేకాకుండా ఇతర మండలాలకు చెందిన 32 పట్టాదారు పాసుపుస్తకాలు, పలు రకాల ఇతర డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు దర్యాప్తు లో భాగంగా నిందితుడిని విచారించగా నిందితుడు కదిరి మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్ బాషా ప్రధాన అనుచరుడని తేలిందన్నారు. అత్తార్ చాంద్‌బాషా ఎమ్మెల్యే గా ఉన్న సమయంలో ప్రభుత్వం ద్వారా నాగిరెడ్డి పల్లి రైల్వే ట్రాక్ పక్కన ఉన్న సర్వే నెంబర్ 1022, 931-1లలో ప్రభుత్వం తరపునుండి నిరుపేదలకు ఇళ్ళ పట్టాలు పంపిణి చేసే విషయంలో కూడా పలువురి నుంచి వేలాది రూపాయలు వసూలు చేసినట్లు తేలిందన్నారు. అంతేకాకుండా సర్వే నెంబర్ 1777-2లోని భూమి విషయంలో నకిలీ పత్రాలు సృష్టించి పేదలకు విక్రయించారని తమ దర్యాప్తులో తేలిందన్నారు. ఈ మేరకు షేక్ షామీర్ బాషాను అరెస్ట్ చేసి ల్యాండ్ గ్రాబింగ్ కేసుల ప్రత్యేక కోర్టు, అనంతరం కోర్టులో హాజరు పరుచగా న్యాయమూర్తి 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించారన్నారు. ఈ కేసులో ప్రధాన సూత్ర దారులుగా ఉన్న రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ మున్వర్, పరికి షామీర్ బాషా, కొలిమి అర్షద్ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు సిఐ చెప్పారు.

జిల్లాలో నేరాల నియంత్రణకు చర్యలు

జిల్లా ఎస్పీ వి. రత్న

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లాలో నేరాలను నియంత్రణకు అన్ని రకాల చర్యలు తీసుకొని ప్రజలలో పోలీసులు పట్ల మంచి అభిప్రాయం ఏర్పడే విధంగా చర్యలు తీసుకుంటున్నామని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ వి రత్న పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఆదివారం ప్రజాశక్తి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వివరించారు. జిల్లాలో అసాంఘిక కార్యక్రమాలు చేపడుతున్న వ్యక్తులు ఎలాంటి వారినైనా ఉపేక్షించబోమని, రాజకీయ ఒత్తిడులకు తొలొగ్గమని చెప్పారు. చట్టాన్ని అతిక్రమించిన వారు ఎలాంటి వారినైనా ఉపేక్షించమని తెలిపారు.

ప్రశ్న : మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై మీ అభిప్రాయం

జవాబు: జిల్లావ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాం. నేరాల నియంత్రణకు పోలీసు అధికారులు గట్టిగా పనిచేసి పోలీస్ శాఖ పట్ల ప్రజల విశ్వాసంతో పెంచే విధంగా చర్యలు చేపడుతున్నాం. మహిళలు చిన్నారులపై జరిగే అఘాయిత్యాలపై వెంటనే నిందితులను గుర్తించి వారిని ఫోక్సో చట్టాన్ని ఉపయోగిస్తున్నాం. మహిళలు చిన్నారుల విషయాల్లో ఎలాంటి వారైనా ఉపేక్షించబోం. సైబర్ నేరాలు, మహిళల భద్రతపై పోలీసులు జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహించారు. ఇంటి భద్రతపై మహిళలకు అవగాహన కల్పించి, ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించాం. ఎలాంటి అనుమానితులు అనిపించినా పోలీసులు దృష్టికి తీసుకురావాలని పోలీస్ నెంబర్లను వారికి అందజేశాం.

ప్ర : జిల్లాలో నేర నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.

జ: శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్ స్టేషన్లలో నేరాల నియంత్రణకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. జిల్లాలో ఉన్న సరిహద్దు పోలీస్‌స్టేషన్లలో అన్ని నేరాల నియంత్రణకు చర్యలు చేపట్టాం. సరిహద్దు పోలీస్ స్టేషన్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మద్యం అక్రమ రవాణా కట్టడికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఫ్యాక్షన్ గ్రామాల్లో నెలకొంటున్న పరిస్థితులను వెనువెంటనే తెలుసుకుంటున్నాం. మహిళ పోలీసులు తరచూ గ్రామాలను సందర్శించి ప్రజలకు అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా వ్యాప్తంగా నేరాల రేటును తగ్గించడానికి ఫ్యాక్షన్ గ్రామాలను గుర్తించి అక్కడ ఏయే సమస్యలు ఉన్నాయో తెలుసుకొని సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులకు ఆదేశాలిచ్చాం.

ప్ర : ఇటీవల కాలంలో జిల్లావ్యాప్తంగా దొంగతనాలు దోపిడీలు పెరిగిపోతున్నాయి, దానిపై మీ అభిప్రాయం.

జ: సత్య సాయి జిల్లాలో శాంతి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాం. చోరీల నియంత్రణ, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేసే విధంగా చర్యలు చేపడుతున్నాం. రాత్రి వేళల్లో జిల్లా పోలీసులు ముమ్మురంగా గస్తీలు, పెట్రోలింగ్, నైట్ బీట్ చెకింగ్ నిర్వహిస్తున్నారు. అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నాం. ప్రజాశాంతికి భంగం కలిగించే వారిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి కేసులు నమోదు చేస్తున్నాం. ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్లు, లాడ్జిల్లో, అర్ధరాత్రి వేళల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న అపరిచితుల వ్యక్తులపై తనిఖీలు చేసి అలాంటి వారిపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నాం.

ప్ర : గంజాయి అక్రమ రవాణాపై ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

జ: జిల్లా వ్యాప్తంగా గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడానికి తగిన చర్యలు తీసుకుంటున్నాం. వాహన తనిఖీలు ముమ్మరంగా చేపట్టి గంజాయి, కర్నాటక మద్యం, నాటుసారా అక్రమ రవాణా జరక్కుండా చర్యలు తీసుకుంటున్నాం. రాత్రి వేళల్లో ముమ్మురంగా గస్తీలు పెట్రోలింగ్ నిర్వహించి జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు చేపడుతున్నాం.

ప్ర : జిల్లాలో యువతకు మీరిచ్చే సలహా..

జ: శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా ఇటీవల నేరాలకు పాల్పడుతున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. వారిలో యువకులు పాత్ర ఎక్కువగా ఉంది. మద్యం, గంజాయి మత్తులో యువకులు ఎక్కువ శాతం నేరాలకు పాల్పడుతున్నారు. అలాంటి వారిపై ప్రత్యేక దృష్టి సారించాం. కళాశాలల్లో, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. యువత పెడదోవ పట్టకుండా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా, ప్రజాశాంతికి భంగం కలిగించినా అలాంటి వారిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి కేసులు నమోదు చేస్తున్నాం. వీటితోపాటు మద్యం సేవించి వాహనాలు నడిపే వారి పై కేసులు నమోదు చేస్తున్నాం.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

అనుమానితుల ఇళ్లలో సోదాలు (పాతచిత్రం)

ఎస్పీ పి.జగదీష్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రణాళికలు
జిల్లావ్యాప్తంగా కార్డెన్‌సెర్చ్‌లు
మట్కా, పేకాటపై దాడులు
రోడ్డుభద్రతా ఉల్లంఘనలపై చర్యలు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

మట్కా, పేకాట, తదితర అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ కోసం ఎస్పీ పి.జగదీష్ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు అమలు చేస్తున్నారు. ముందస్తు చర్యలు తీసుకోవడం వల్ల దాదాపు ఆయా కార్యక్రమాలు నియత్రణలోకి వస్తాయని భావనతో జిల్లాలోని 42 పోలీసుస్టేషన్ల పోలీసు అధికారులు, సిబ్బందితో విస్తృత తనిఖీలు చేయిస్తున్నారు. ఏరోజుకారోజు పోలీసులు దేనిపై ఫోకస్ పెట్టి చెకింగులు నిర్వహించాలో ఎస్పీ సిద్ధం చేయించి ఆ ప్రణాళికలను కార్యాచరణకు పంపుతున్నారు.

మట్కా, పేకాటలపై దాడులు

పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజల జీవితాలను ఛిద్రం చేసే మట్కా, పేకాటలపై పోలీసులు పటిష్ట చర్యలు తీసుకున్నారు. గత వారంలో మట్కా స్థావరాలపై దాడులు చేపట్టి 18 కేసులు నమోదు చేసి 27 మందిని అరెస్టు చేశారు. వీరి నుంచి రూ. 3,31,660 నగదు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి 23 కేసులు నమోదు, 85 మందిని అరెస్టు చేశారు. పేకాటరాయుళ్ల నుంచి రూ.2,89,240 నగదు సీజ్ చేశారు.

గుత్తిలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు (పాతచిత్రం)

రోడ్డు భద్రతా ఉల్లంఘనలపై చర్యలు

రోడ్డు ప్రమాదాలకు సింహభాగం కారణమైన రోడ్డు భద్రతా ఉల్లంఘనలపై జిల్లా పోలీసులు కొరడా ఝుళిపించారు. ఈ ఉల్లంఘనలపై 3253 ఈ చలాన్లు జారీ చేసి రూ. 7,51,736 ఫైన్ వేశారు.

బహిరంగ మద్యపానంపై చర్యలు

జిల్లాలో పోలీసులు బహిరంగ మద్యపానంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. అనంతపురం నగరంతో పాటు మున్సిపల్ పట్టణాలు, మండల కేంద్రాల శివారు ప్రాంతాలతో పాటు మిగితా వల్నరబుల్ ప్రదేశాలలో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి గత వారంలో ఓపెన్ డ్రింకింగ్ చేస్తున్న 373 మందిని పట్టుకున్నారు.

కార్డెన్‌సెర్చ్ ఆపరేషన్లు

గత వారం రోజుల్లో జిల్లా వ్యాప్తంగా 5 పోలీస్ సబ్ డివిజన్ పరిధుల్లోని సుమారు 95 గ్రామాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించి అనుమానాస్పద వ్యక్తులు, పాత కేసుల్లోని నిందితులు, ట్రబుల్ మాంగర్స్ ఇళ్లు, కల్లం దొడ్లలో తనిఖీలు చేపట్టారు. అలాగే జిల్లాలోని పోలీసుస్టేషన్లలో 35 పోలీసు స్టేషన్ల పరిధుల్లోని రౌడీషీటర్లను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. పాత పంథా వదిలి సత్ప్రవర్తనతో జీవించాలని... మళ్లీ నేరాలు జోలికెళితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విజిబుల్ పోలీసింగ్

ప్రజల భద్రతకు భరోసా... నేరాల నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, శాంతిభద్రతల పరిరక్షణ ధ్యేయంగా జిల్లాలో ఉన్న 42 పోలీసు స్టేషన్ల అధికారులు, సిబ్బంది బృందాలుగా ఏర్పడి క్రమం తప్పకుండా వారం రోజుల పాటు విజిబుల్ పోలీసింగ్ చేపట్టారు. వీటితో పాటు బ్యాంకులు, ఏటిఎంలు, దేవాలయాలు భద్రత మరియు లాడ్జిలు, దాబాల తనిఖీలు విస్తృతంగా నిర్వహించారు

షెడ్డులోకి దూసుకెళ్లిన కారు

ఆరుగురు యువకులకు గాయాలు

ప్రజాశక్తి-రాయదుర్గం

ధ్వంసమైన షెడ్డు, కారు

మండలంలోని 74 ఉడేగోళం వైఎస్ఆర్ సర్కిల్ వద్ద ఆదివారం తెల్లవారుజామున ఓ కారు షెడ్డులోకి దూసుకెళ్లింది. రాయదుర్గంలో పెళ్లి కోసం అనంతపురం నుంచి వచ్చిన ఆరుగురు యువకులు శనివారం రాత్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మద్యానేశ్వర స్వామి ఆలయ సమీపంలో పార్టీ చేసుకున్నారు. మద్యం మత్తులో రాయదుర్గానికి వస్తూ వైఎస్ఆర్ కూడలిలో ఉన్న చిల్లర కొట్టు దుకాణం షెడ్డులో దూసుకెళ్లింది. ఈ ఘటనలో షెడ్డు పూర్తిగా ధ్వంసమైంది. కారు కూడా దెబ్బతింది. కారులో ఉన్న యువకులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ ఘటనలో సుమారు రూ.1.50 లక్షల విలువజేసే ఆస్తి నష్టం సంభవించిందని షెడ్డు యజమాని వాపోయాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

కేబుల్ వైర్ చోరీ

వరుస చోరీలతో బెంబేలెత్తుతున్న రైతులు

ప్రజాశక్తి-పుట్లూరు

చోరీ ఘటనను పరిశీలిస్తున్న పోలీసులు

మండల పరిధిలోని మడుగుపల్లి గ్రామ శివారులో ఉన్న నాగేశ్వర్‌రెడ్డి, ప్రసాద్‌నాయుడు, వీరేష్, చిన్న పెద్దయ్య తదితరులకు చెందిన తోటల్లో ఉన్న వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లను శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న ఎస్ఐ హేమాద్రి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేబుల్ వైర్ల చోరీపై రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా ఇటీవల వ్యవసాయ తోటల్లో కేబుల్ వైర్లు చోరీకి గురవుతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఎక్కువగా మడ్డిపల్లి, మడుగుపల్లి, చెర్లోపల్లి, తదితర గ్రామాల్లో చోరీలు జరుగుతున్నాయి. ఆయా గ్రామాల్లో గతంలో కూడా కేబుల్ వైర్లు చోరీకి గురయ్యాయి. అప్పట్లో ఓ దొంగ దొరకడంతో కేబుల్ వైర్లను రికవరీ చేసి రైతులకు అందజేశారు. తిరిగి చోరీలు ప్రారంభం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

గుత్తి సిపిఎం మండల కార్యదర్శిగా వి.నిర్మల

ప్రజాశక్తి-గుత్తి

సిపిఎం గుత్తి మండల ప్రధాన కార్యదర్శిగా జెడ్.వీరారెడ్డి కాలనీకి చెందిన వి.నిర్మల ఎన్నికయ్యారు. పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో నిర్వహించిన మండల మహాసభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు వి.సావిత్రమ్మ సమక్షంలో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శిగా వి.నిర్మల, కార్యవర్గ సభ్యులుగా బి.రామకృష్ణ, ఎన్.రేణుక, యు.మల్లికార్జున, సి.రమేష్, రంజిత్‌నాయక్, రామేశ్వరి, మద్దిలేటి, రేవతి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి వి.నిర్మల మాట్లాడుతూ మండలంలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటాలు కొనసాగిస్తామన్నారు. గ్రామీణ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

పుట్లూరు మండల కార్యదర్శిగా సూరి

పుట్లూరు : సిపిఎం మండల కార్యదర్శిగా ఎస్.సూరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం మండలంలోని కడవకల్లు గ్రామాల్లో నిర్వహించిన మండల మహాసభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప, ఎం.కృష్ణమూర్తి హాజరై మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా ఎస్.సూరితోపాటు సభ్యులుగా జి.వెంకటచౌదరి, టి.పెద్దయ్య, బి.భాస్కర్‌రెడ్డి, కె.నాగభూషణం, ఎస్.నారాయణస్వామి, రేవతిని ఎన్నుకున్నారు.

పోలీస్‌స్టేషన్ ఆవరణలో పాములు

భయాందోళనలో నార్పల స్టేషన్ సిబ్బంది

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో రోజురోజుకీ పాముల బెడద అధికమవుతోంది. రోజూ రాత్రి సమయాల్లో పోలీస్‌స్టేషన్ ఆవరణలో పాములు తిరిగుతున్నాయని సిబ్బంది వాపోతున్నారు. దీనికితోడు ఇప్పటికే రెండు, మూడుసార్లు స్టేషన్‌లోని కంప్యూటర్ రూములోకి పాములు వచ్చిన విషయం తెలిసిందే. గుర్తించిన సిబ్బంది పాములను చంపారు. ఈనేపథ్యంలో చీకటి పడిందంటే స్టేషన్ ఆవరణలో నడవడానికి సైతం భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పోలీస్‌స్టేషన్‌లో పలు ప్రమాదాలు, చోరీ కేసుల్లో పట్టుబడిన వాహనాలు అధిక సంఖ్యలో ఉంచడంతో చెత్తాచెదారం ఎక్కువైంది. దీంతో పాముల సంచారం అధికమైందని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి స్టేషన్ ఆవరణలో ఉన్న పాత వాహనాలను వేలం వేయడంతోపాటు స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు, పోలీసు సిబ్బంది కోరుతున్నారు.

నార్పల పోలీస్‌స్టేషన్ ఆవరణలో సంచరిస్తున్న పాము

పెన్షన్ సౌకర్యం కల్పించాలని వినతి

ప్రజాశక్తి-రాయదుర్గం

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుతో 98 డీఎస్సీ ఉపాధ్యాయులు

క్రమబద్ధీకరణ, పెన్షన్ లబ్ధి ప్రయోజనాన్ని చేకూర్చాలని 1998 డీఎస్సీ ఎంటిఎస్ ఉపాధ్యాయులు కోరారు. ఈమేరకు ఆదివారం రాయదుర్గంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులును కలిసి విన్నవించారు. ముందుగా ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ఉద్యోగ క్రమబద్ధీకరణ చేయాలని, పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలని, పదవీ విరమణ అనంతరం పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. ఈ విషయం త్వరలో జరగనున్న శాసనసభ సమావేశాల్లో సిఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి తమ కోర్కెలు నెరవేరేలా చూడాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ సిఎంతో చర్చించి మీకు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం ఎంటిఎస్ ఉపాధ్యాయులు శర్మస్‌సాహెబ్, యూనస్, సాయిరాం, ఇబ్రహీం, రమేష్, చంద్రశేఖర్, ఈశ్వర్‌రెడ్డి, గాదిలింగప్ప, టిడిపి నాయకులు పురుషోత్తం, ఉస్మాన్, తదితరులు పాల్గొన్నారు.

గుంతల పూడ్చివేతకు రూ.1.5కోట్లు మంజూరు

టిడిపి మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ

ప్రజాశక్తి-శింగనమల

పనులను ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు

నియోజకవర్గవ్యాప్తంగా రోడ్లలో గుంతలు పూడ్చివేతకు ప్రభుత్వం రూ.1.50కోట్లు మంజూరు చేసినట్లు టిడిపి మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ తెలిపారు. ఆదివారం మండల కేంద్రం సమీపంలోని మరువకొమ్మ వద్ద రోడ్లలో గుంతలు పూడ్చివేత పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే సంక్రాంతి నాటికి రోడ్లలో గుంతలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే సిఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. ఇందులో భాగంగానే నియోజకవర్గవ్యాప్తంగా రోడ్లలో గుంతలు పూడ్చేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో డిఇ బి.సురేష్‌నాయక్, ఆర్అండ్‌బి ఎఇ లక్ష్మి, టిడిపి సీనియర్ నాయకులు మారుతీనాయుడు, అట్టే రామాంజనేయులు, ఏకిల ఆదినారాయణ, సి.వెంకటేష్, మాసూలు చంద్రమోహన్, రంగారెడ్డి, రాఘవరెడ్డి, బోయ సత్యనారాయణ, బండి వెంకటనారాయణ, పెద్దమట్లగొంది అనిల్, నాగలింగం, ముంతా వెంకటేష్, కాయల అనిల్‌కుమార్, శివపురం ఎర్రిస్వామి, మొండిపోగుల ఎర్రిస్వామి, చలమయ్య, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

హిందూపురం : పట్టణంలోని కొట్నూరు నిర్మలా వద్ధాశ్రమంలోని ఒయాసిస్ చర్చిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బెంగళూరుకు చెందిన శ్రీ హీలింగ్ వైద్యశాల నిపుణులు ప్రశాంత్ కుమార్, చేతన తదితరులు సామాజిక సేవకురాలు ఆలిశెట్టి శ్వేతా ఆధ్వర్యంలో పాస్టర్ జాన్ అధ్యక్షతన ముదిరెడ్డిపల్లి అఖిలాంధ్ర పట్టు చేనేత కార్మిక గౌరవాధ్యక్షులు ఏసీ. నాగరాజు సహకారంతో ఉచిత హీలింగ్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూఖ్ ఖాన్, టిప్పు సుల్తాన్ మానవతా రక్తదాన సంఘం యువ నాయకులు ఉసామా ఖాన్, బాబన్న, గంగప్ప, అంజన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు పంపిణీ

ప్రజాశక్తి-అనంతపురం

నిత్యావసర సరుకులు, విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న నిత్యసురభి ట్రస్టు నిర్మలమురళి

నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో నగరంలోని కోవూరునగర్‌లో ఉన్న ఎయిమ్ ఫర్ సేవ బాలుర ఛాత్రాలయంలో విద్యార్థులకు నిత్యావసర సరుకులు, విద్యాసామగ్రి అందజేశారు. ట్రస్టు సభ్యులు రఘునాథ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన జ్ఞాపకార్థం ఆయన సతీమణి సౌధామణి, కుటుంబ సభ్యులు నిత్యావసర వస్తువులు, విద్యాసామగ్రి, బియ్యం ప్యాకెట్లకు ఆర్థికసాయం అందజేశారు. అలాగే ఆశ్రమం నిర్వాహకులు చక్రపాణి సమక్షంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ఛైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మలమురళి, సౌధామణి, చక్రపాణి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్లు బిగిస్తే అడ్డుకుందాం

కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి సోనియా శీన

ప్రజాశక్తి-ఉరవకొండ

వ్యవసాయ పంపుసెట్లు, నివాసగృహాలకు విద్యుత్ స్మార్ట్‌మీటర్లు బిగిస్తే ఎక్కడికక్కడ అడ్డుకుందామని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి సోనియాశీన పిలుపునిచ్చారు. ఆదివారంఉరవకొండలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ఆదేశాలకు తలొగ్గి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నివాసగృహాలు, వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు పెట్టేందుకు పూనుకుందన్నారు. అదానీ, షిరిడీ సాయి, తదితర కంపెనీలకు వాటి పంపిణీ కాంట్రాక్టులను కట్టబెట్టిందన్నారు. స్మార్ట్‌మీటర్ల కాంట్రాక్టులో పెద్దఎత్తున అవినీతి చోటు చేసుకుందని ఆరోపించారు. టిడిపి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మీటర్లను వ్యతిరేకించి, హైకోర్టులో పిటీషన్లు కూడా వేసిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే నేడు అధికారంలోకి వచ్చాక ఆ ఒప్పందాలను రద్దు చేయకపోగా స్మార్ట్ మీటర్ల ప్రక్రియను కొనసాగించడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు ముందుగా బిగించి, ఆ తర్వాత నివాస గృహాలకు మీటర్లు బిగించే ప్రక్రియకు సిద్ధమవుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనివల్ల దళితులు, గిరిజనలకు తీవ్రమైన నష్టం కలుగుతుందని అవేదన వ్యక్తం చేశారు. ఇకపోతే ఉచిత సిలిండర్లు పేరుమీద ఏడాదికి రూ.2,655 కోట్లు ఖర్చు పెడుతున్నామని గొప్పలు చెబుతున్న కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై రూ.6వేల కోట్ల భారం వేసిందని ఆరోపించారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకించాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈనెల 5న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసనలు చేపడుతున్నట్టు వివరించారు.

గ్రూప్-2 పరీక్షలను ఫిబ్రవరిలో నిర్వహించాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-గుంతకల్లు

సమావేశంలో మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నాయకులు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే గ్రూప్-2 పరీక్షలను జనవరి 5న కాకుండా ఫిబ్రవరిలో నిర్వహించాలని డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని హంపిరెడ్డి భవనంలో నిర్వహించిన విలేకరు సమావేశంలో డివైఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ గ్రూప్-2 పరీక్షలను ప్రభుత్వం రానున్న ఏడాది జనవరిలో నిర్వహించేందుకు నిర్ణయం తీసుకుందన్నారు. అయితే డిసెంబర్‌లో నిర్వహించే కానిస్టేబుల్, ఇతర ఉద్యోగాలకు చాలామంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. అలాంటి సమయంలో గ్రూప్-2 పరీక్షలు నిర్వహించడం సరైంది కాదన్నారు. కావున ఆ నోటిఫికేషన్ ఉపసంహరించుకుని ఫిబ్రవరిలో నిర్వహించేందుకు కొత్త నోటిఫికేషన్ జారీ చేయాలని కోరారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ సహాయ కార్యదర్శి చొక్కా సునీల్, మల్లేష్, హనుమేష్, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు రెవెన్యూ డివిజన్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా రాజ్‌కుమార్

యాడికి : గుంతకల్లు రెవెన్యూ డివిజనల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షునిగా యాడికి మండలంలో డిప్యూటీ తహశీల్దార్‌గా పని చేస్తున్న రాజ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్‌లోని ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రాజ్‌కుమార్ ఎన్నిక పట్ల యాడికి మండల రెవెన్యూ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం రెవెన్యూ డివిజన్ ఉద్యోగులు రాజ్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు.

6న మండల సర్వసభ్య సమావేశం

బ్రహ్మసముద్రం : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈనెల 6న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ నందకిషోర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు, మండల కోఆప్షన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, మండల, తాలూకా స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

త్వరలో పెనుకొండకు మరిన్ని పరిశ్రమలు

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

ప్రజాశక్తి - పెనుకొండ

పెనుకొండకు త్వరలో మరిన్ని పరిశ్రమలు రానున్నాయని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. ఆదివారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పెనుకొండ నియోజకవర్గంలోని 5 మండలాలక్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జులు, ఫీల్డ్ అసిస్టెంట్ ,డీలర్ , యానిమేటర్ల ,టీడీపీ నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలే టిడిపికి బలమన్నారు. కార్యకర్తల మేలు కోసం జీవితా బీమాతో కూడిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. నియోజక వర్గంలోని ప్రతి మండల, పంచాయతీ కేంద్రాల్లో ఎన్టీఆర్ విగ్రహాలు నెలకొల్పనున్నట్లు తెలిపారు. మండల కేంద్రాల్లో పార్టీ కార్యాలయాలు కూడా ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. కియా వంటి పరిశ్రమలు ప్రస్తుతం పెనుకొండలో ఉన్నాయని, మహిళలు కోసం గార్మెంట్ పరిశ్రమలు భవిష్యత్తులో పెనుకొండకు రానున్నాయని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు నరసింహారావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ ఉద్యోగుల అసోసియేషన్ ఎన్నిక

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్


నూతనంగా ఎన్నికైన కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు

పట్టణంలో ఆదివారం కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ ఉద్యోగుల అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. అసోసియేషన్ ప్రెసిడెంట్లుగా రత్నశ్యామ్‌రాయి (డిప్యూటీ తహశీల్దార్, బొమ్మనహాల్), సుబ్రమణ్యం (ఎమ్మెల్యే పాయింట్, రాయదుర్గం), వైస్ ప్రెసిడెంట్లుగా బసవకుమార్ (డిప్యూటీ తహశీల్దార్, డి.హీరేహాల్), విజయలక్ష్మి (డిప్యూటీ తహశీల్దార్, గుమ్మగట్ట), తిప్పేస్వామి (డిప్యూటీ, తహశీల్దార్ కుందుర్పి), సెక్రటరీగా గురుబ్రహ్మ (రీసర్వే డిప్యూటీ తహశీల్దార్, కుందుర్పి), ఆర్గనైజింగ్ సెక్రటరీగా గౌతమ్ (రెవెన్యూ ఇన్స్‌పెక్టర్, శెట్టూరు), జాయింట్ సెక్రటరీలుగా నాగిరెడ్డి (రెవెన్యూ ఇన్స్‌పెక్టర్, బ్రహ్మసముద్రం) తలారి వెంకటేశులు (సీనియర్ అసిస్టెంట్, కళ్యాణదుర్గం), శ్రీనివాసులు (నెహ్రూ డ్రైవర్), ట్రెజరర్‌గా వెంకటేశులు (డిప్యూటీ తహశీల్దార్, రెవెన్యూ డివిజనల్ ఆఫీస్)ను ఎన్నుకున్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి-ఉరవకొండ

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

జాతీయ బాలల దినోత్సవం-2024 సందర్భంగా ఆదివారం నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉరవకొండలోని కరిబసవ స్వామి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చదరంగం, క్విజ్, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పోటీల్లో దాదాపు 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన విజేతలకు బాలల దినోత్సవం రోజున బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిస్వార్థ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వెంకట్, సునీత, శైలజ, నాగరత్న, జ్యోతి, శ్రీదేవి, నిర్మల, లక్ష్మి, భాగ్య, యుగంధర్, చంద్రమోహన్, శ్రీనివాస్, వేణుగోపాల్, పోతురాజు, మల్లేష్, చిరంజీవి, నూరు, యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబా పోరాటస్ఫూర్తిని కొనసాగిద్దాం

సాయిబాబా సంతాప సభలో వక్తలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సాయిబాబా సంతాప సభలో మాట్లాడుతున్న వక్తలు

ఆదివాసీలు, అనగారినవర్గాల న్యాయం సాధన కోసం ప్రొఫెసర్ సాయిబాబా చేసిన పోరాటం స్ఫూర్తిదాయమని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం నగరంలోని ఎన్జీఓ హోంలో కెవిఎన్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు అధ్యక్షతన విద్యార్థి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఒపిడిఆర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్‌కుమార్, మానవ హక్కుల వేదిక తెలుగు రాష్ట్రాల సమన్వయ కర్త చంద్రశేఖర్, సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అమలాపురం అనే గ్రామంలో 1967 జూలై 24న జన్మించిన ప్రొఫెసర్ సాయిబాబా తన ఐదో ఏటనే పోలియోతో రెండు కాళ్లు పోగొట్టుకున్నాడని, తల్లి సహాయంతో అంగవైకల్యాన్ని, కుటుంబ ఆర్థిక వ్యవస్థను అధిగమిస్తూ అత్యంత ప్రతిభావంతుడుగా ఎదిగాడని తెలిపారు. విద్యార్థి దశ నుంచి పోరాట స్ఫూర్తితో మెలిగాడని, ఆదివాసీలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న యుద్ధాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడని తెలిపారు. ఆపరేషన్ గ్రీన్ హంట్‌కు వ్యతిరేకంగా తుది శ్వాస వరకు అలుపెరుగని పోరాటం సాగించారని తెలిపారు. 2014లో ఆదివాసులతో పాటు సాయిబాబా లాంటి వ్యక్తులపై ఊపా లాంటి క్రూర చట్టాలను బనాయించి ప్రజా గొంతుకను నొక్కేశారని తెలిపారు. 2017 మార్చి 7 న కోర్టు నేర రుజువు లేకపోయినా సాక్షా దారాలు లేకపోయినా అత్యంత దుర్మార్గంగా సాయిబాబా, నలుగురిపై యావత్ జీవ కారాగార శిక్ష , 10 సంవత్సరాల శిక్ష విధించిందన్నారు. ఈ కేసులో అప్పీళ్లపై తీర్పు రావడానికి హైకోర్టుకు ఐదు సంవత్సరాలు సమయం పట్టిందన్నారు.

ఈ విధంగా సాయిబాబా దాదాపు ఏడు సంవత్సరాల పాటు అండా సెల్లో బంధించబడ్డాడని, చివరకు తల్లి మరణిస్తే చూడ్డానికి కూడా కోర్టు పెరోల్ నిరాకరించిందన్నారు. 2022లో నాగపూర్ బెంచ్ నిర్దోషిలనే కేసు కొట్టి వేసినప్పటికీ సుప్రీంకోర్టులో పోలీసులు బెయిల్ రాకుండా అడ్డుకున్నారని, చివరకు నాగపూర్ బెంచి 2024 మార్చి సాయిబాబా తదితరులను నిర్దోషులుగా తీర్పు వెలువరించిందన్నారు. జైల్లో ఉన్న సాయిబాబా ఖైదీల హక్కుల కోసం, సౌకర్యాల కోసం నిరాహార దీక్షలు చేశారని, చివరకు జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత మృతి చెందడం అందరిని బాధించిందన్నారు. సాయిబాబా అమరత్వాన్ని ఎత్తిపడదామన్నారు. ఆయన పోరాట స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమానికి పోరాడటమే సాయిబాబాకు నిజమైన నివాళులు అర్పించినవారమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఓపిడిఆర్ జిల్లా సహాయ కార్యదర్శి జిసి.ప్రకాష్, సిఎల్‌సి జిల్లా కార్యదర్శి ఆదినారాయణ, ఏఐకెఎంఎస్ జిల్లా కార్యదర్శి నాగరాజు, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి వీరేంద్ర, అరుణోదయ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు భూషణ, చంద్రప్ప, పట్టణ పేదల సంఘం అధ్యక్షుడు వీరనారపప్ప, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షుడు యేసు రత్నం, ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షులు వేమన్న, ఎస్సీ, ఎస్టీ జేఏసి రాష్ట్ర అధ్యక్షుడు హరి, సామాజిక న్యాయ ఉద్యమ వేదిక అధ్యక్షులు దాసరి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.